మేడే స్ఫూర్తితో ముందుకు..

- నినదించిన కార్మికలోకం
- అరుణపతాకం రెపరెపలు
- ఘనంగా మేడే వేడుకలు

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా గాజువాక ప్రాంతంలో మేడే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వివిధ కార్మిక సంఘాలు ఉద్యమ స్ఫూర్తిని నింపుతూ కార్యక్రమాలు జరిపాయి. ఆయా కార్మిక సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కార్మికులకు దిశా నిర్దేశం చేశారు. మేడే స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు. అమరుల త్యాగ ఫలితాలు ప్రతి కార్మికుడికీ చేరే విధంగా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు.



ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద కవాతులో సీఐటీయూ కార్యకర్తలు

పెదగంట్యాడ: కార్మికుల ఐక్య పోరాటానికి నిదర్శనమే మే డే అని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజక వర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. స్టీల్ వైఎస్సార్ టీయూసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెదగంట్యాడ జంక్షన్‌లో కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిప్పల దేవన్‌రెడ్డి వైఎస్సార్‌టీయూసీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల శ్రమతోనే ప్రపంచం ముందుకు నడుస్తోందని చెప్పారు. కార్మికుల కృషిని మరువలేమన్నారు. ఐక్య పోరాటాలతో కార్మికులు 8 గంటల పని దినాలను సాధించుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, నక్కా వెంకటరమణ,పిట్టా రెడ్డి,అండిబోయిన అప్పారావు, సంపంగి ఈశ్వరరావు, అప్పలరెడ్డి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- సీపీఐ ఆధ్వర్యంలో పెదగంట్యాడలోని పోతిన సన్యాసిరావు భవన్ వద్ద, గంగవరంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఏజే స్టాలిన్ యూనియన్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎల్లేటి శ్రీనివాసరావు, ఆనంద్, కె అచ్యుత్‌రావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.
- పెదగంట్యాడ సీఐటీయూ కార్యాలయం వద్ద మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ పతాకాన్ని వెంకటరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నమ్మి రమణ, కణితి అప్పలరాజు, సీహెచ్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : సీఐటీయూ గాజువాక డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాలకులు కార్మిక హక్కులపై దాడి చేస్తున్నారని, హక్కులను పరిరక్షించుకోవడానికి సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా గాజువాక మెయిన్ కార్మిక ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, గాజువాక నాయకులు ఎం.రాంబాబు, గొలగాని అప్పారావు, గొల్ల రాము, నక్క నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

- సీపీఐ ఆధ్వర్యంలో మేడే వేడుకలను గాజువాక ప్రాంతంలోని వివిధచోట్ల ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు, కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ జెండాలను ఆవిష్కరించారు. శ్రామికవర్గ సంక్షేమం, హక్కుల రక్షణ కోసం తమ పార్టీ రాజీలేకుండా పోరాడుతోందని పేర్కొన్నారు.



స్టీల్ ఐఎన్‌టీయూసీ కార్యాలయం వద్ద మేడే వేడుకల్లో నాయకులు


స్టీల్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విస్తరణ కూడలి వద్ద వేడుకలు

కార్యక్రమంలో నాయకులు ఎల్లేటి శ్రీనివాస్, జి.ఆనంద్, కె.అచ్యుతరావు, పి.దుర్గారావు, ఎ.మసేన్‌రావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందాం

ఉక్కునగరం: మేడే స్ఫూర్తితో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందామని సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్. నర్సింగరావు పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని (మే డే) గురువారం స్టీల్‌ప్లాంట్‌లో ఉత్సాహంగా నిర్వహించారు. ఉక్కుఅడ్మిన్ కూడలి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ పెట్టుబడిదారీ విధానాల వల్ల ఆర్థిక సంక్షోభం రోజురోజుకూ తీవ్రమవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో జె. అయోధ్యరామ్, యు. రామస్వామి, ఎన్. రామారావు పాల్గొన్నారు.

- స్టీల్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సెక్టార్-11, సెక్టార్-5, సెక్టార్-1, యూనియన్ కార్యాలయాలతో పాటు విస్తరణ కూడలి సమీపంలో నిర్వహించిన వేడుకల్లో యూనియన్ ప్రధానకార్యదర్శి డి. ఆదినారాయణ, అధ్యక్షులు కె.ఎస్.ఎన్.రావులు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు డి. నర్సింగరావు, కె. రాజబాబు, తాండ్ర కనకరాజు, పెద్దిరాజు పాల్గొన్నారు.
- స్టీల్ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో యూనియన్ కార్యాలయం వద్ద యూనియన్ సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు పి.వి. రమణమూర్తి, కొమ్ము ప్రసాద్, కారు రమణ, గోపాలరాజు తదితరులు పాల్గొన్నారు.
- ఉక్కు లేబర్ గేటు వద్ద జరిగిన మే డే కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు డాక్టర్ బూసి వెంకటరావు పాల్గొని 8 గంటల పని దినం కోసం జరిగిన పోరాటంలో నేలకొరిగిన అమరులకు నివాళులర్పించారు.
- స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో బీసీ గేటు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జి. శ్రీనివాసరావు, యు. సోమేష్ తదితరులు పాల్గొన్నారు.


పెదగంట్యాడ జంక్షన్‌లో వైఎస్సార్‌టీయూసీ జెండా ఆవిష్కరిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి


మేడే ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఏజే స్టాలిన్


జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు


ఉక్కు లేబర్ గేటు వద్ద వేడుకలు


చినగంట్యాడలో జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న స్టాలిన్

ఉద్యమాల ద్వారానే హక్కుల సాధన

అగనంపూడి: ఐక్య ఉద్యమాల ద్వారా సాధించుకున్న కార్మికుల హక్కులను నేటి పాలకులు కాలరాస్తున్నారని బొర్రమాంబ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు సాయిన అప్పారావు అన్నారు. అగనంపూడి నిర్వాసితకాలనీలో మే డే సందర్భంగా ఆయన పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో కర్రి దోశేంద్ర, బలిరెడ్డి సత్యనారాయణ, డొక్కా రమేష్, గంతకోరు అప్పారావు, శీరంశెట్టి బాబ్జి, రెడ్డి శ్రీను, లంకా రామునాయుడు పాల్గొన్నారు.

పాత అగనంపూడి కూడలిలో మహాత్మాగాంధీ సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నక్కా సోమునాయుడు, నగరాల అప్పారావు, అప్పలనాయుడు, మోహన్ పాల్గొన్నారు.


పతాకావిష్కరణ చేస్తున్న బొర్రమాంబ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘ ప్రతినిధులు


సత్రం కూడలిలో పతాకాన్ని ఎగురవేస్తున్న మహాత్మా గాంధీ సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు

క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సత్కారం



రమణారెడ్డిని సత్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అగనంపూడి: కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు వెలుగు సంయుక్తంగా ప్రకటించిన మహానంది అవార్డును అగనంపూడి షిర్డీసాయి సేవా సమితి అధ్యక్షుడు కొయ్య రమణారెడ్డి అందుకున్నారు. ఈ మేరకు అగనంపూడి షిర్డీ సాయి బాబా ఆలయంలో గురువారం రమణారెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త భాస్కరభట్ల సత్యప్రసాద్ శర్మ, బుల్లితెర నటుడు రవితేజ, శివగణేష్‌శర్మ, ఆలయ కమిటీ ప్రతినిధులు ధర్మాల వ్యాసశర్మ, జి.శంభుడు, పీఎల్ఎన్‌రాజు, సత్యనారాయణ, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు


చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గాజువాక: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గాజువాక శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు గురువారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. రిసోర్సు పర్సన్ తుంపాల శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో చిన్నారులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు తమకు నచ్చిన అంశాలపై చిత్రాలను వేసే విధంగా ప్రోత్సహించారు. అనంతరం గ్రంథాలయాధికారి బి.చంద్రకళ విద్యార్థులకు స్నేహబలం కథలను వివరించి వాటికి అర్థాలు తెలిపారు.

పెదబాబుకు ఘన నివాళి


పెదబాబుకు నివాళులర్పిస్తున్న నాయకులు

అగనంపూడి: లంకలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థల దాత, మాజీ సర్పంచ్, కన్యకాపరమేశ్వరి దేవస్థానం చైర్మన్ యలమర్తి వరహా నరసింహం (పెదబాబు)కు పలువురు నాయకులు ఘన నివాళులర్పించారు. లంకెలపాలెంలో గురువారం ఏర్పాటు చేసిన సంతాప సభలో ఉక్కు ఇంటక్ నాయకులు మంత్రి రాజశేఖర్, సుందరపు అప్పారావు, యలమర్తి వెంకటరావు, నరసింగరావు, వై.కె.సత్యానందం, వర్తక సంఘం నాయకులు, ఆర్య వైశ్య సంఘం నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వేద భరద్వాజ్‌కు జాతీయ బాల చిత్రకళా పురస్కారం


భరద్వాజ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వంశీకృష్ణ, టీచర్ దానయ్య

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కేంద్రియ విద్యాలయం (కేవీ) 10వ తరగతి విద్యార్థి అదపాక వేద భరద్వాజ్‌కు జాతీయ స్థాయి బాల చిత్రకళా పురస్కారం లభించింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, కనక మహాలక్ష్మి దంపతుల కుమారుడైన వేద భరద్వాజ్ ఇటీవల స్కూల్ ఆఫ్ ప్లానింగ్ మరియు ఆర్కిటెక్చర్, డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన 12వ జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ఈ పురస్కారం అందుకున్నారు. గురువారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వంశీకృష్ణ అవార్డు గ్రహీత భరద్వాజ్, చిత్రలేఖన ఉపాధ్యాయుడు డి. దానయ్యను అభినందించారు.

5 నుంచి ఆధార్ స్పెషల్ క్యాంప్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఈ నెల 5 నుంచి 15 వరకు ఆధార్ స్పెషల్ క్యాంప్ నిర్వహించనున్నట్టు 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు తెలిపారు. సెక్టార్-1 షాపింగ్ కాంప్లెక్స్‌లోని వార్డు సచివాలయంలో నిర్వహించనున్న క్యాంప్‌లో కొత్త ఆధార్ కార్డు, బయోమెట్రిక్ అప్‌డేషన్, డాక్యుమెంట్ అప్‌డేషన్‌తో పాటు ఆధార్ కార్డులో ఉన్న పేరు, అడ్రస్, పుట్టిన తేదీ, జెండర్, మొబైల్ నెంబర్ సవరణలు చేస్తారని ఆయన తెలిపారు. ఉక్కునగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉక్కు కార్మికులకు కూటమి ద్రోహం

- కార్మికుల తొలగింపునకు నిరసనగా 20న సమ్మె
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు


ప్రసంగిస్తున్న సీహెచ్ నర్సింగరావు

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు టీడీపీ, జనసేన, బీజేపీ(కూటమి) ద్రోహం చేస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు ఆరోపించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పాతగాజువాకలో నిర్వహించిన మేడే కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. స్టీల్‌ప్లాంట్‌లో మూడు వేల మంది కార్మికులను తొలగిస్తున్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడం అన్యాయమన్నారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిరసిస్తూ ఈనెల 20న నిరవధిక సమ్మె నిర్వహించనున్నట్టు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా ఇక్కడ కూడా సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

రాష్ట్రానికి అన్యాయం

చంద్రబాబు, నితీష్ కుమార్ మద్దతుతోనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నడుస్తుందన్నారు. అయినా రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చంద్రబాబు దృష్టిసారించడం లేదని ఆరోపించారు. అత్యంత నాణ్యమైన స్టీల్‌ను ఉత్పత్తి చేస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా, నక్కపల్లిలో ఏర్పాటు కానున్న మిట్టల్ స్టీల్‌కు గనులు కేటాయిస్తున్నారన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు లేకపోవడం వల్ల టన్నుకు ఐదారు వేల రూపాయలు అదనపు భారం పడుతోందన్నారు. 2000లో జింక్ పరిశ్రమను మూసివేసి వేదాంత కంపెనీకి అప్పగించారన్నారు. కార్మికులు నిర్వహిస్తున్న ఐక్య పోరాటాల కారణంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం కాకుండా అడ్డుకోగలుగుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.జగ్గునాయుడు, ఎం.రాంబాబు, కె.కిరీటం తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం


పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సాయినాథునికి ప్రత్యేక పూజలు


బాబాను దర్శించుకుంటున్న భక్తులు

పెదగంట్యాడ: స్థానిక సమతానగర్‌లోని షిర్డీసాయి శాంతి ధామంలో వచ్చే నెల 18వ వరకు సాయినాథుడి చరిత్ర పారాయణ చేయనున్నామని ఆలయ కమిటీ చైర్మన్ సత్యంబాబు, కార్యదర్శి రవిశేఖర్ తెలిపారు. బాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. సాయి సచ్చరితను రోజుకో అధ్యాయం వంతున పారాయణ చేయనున్నామని చెప్పారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

స్టీల్ ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ‘కొమ్ము’

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టీయూసీ నూతన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోక్‌ఓవెన్స్ విభాగం జనరల్ ఫోర్‌మెన్ కొమ్ము ప్రసాదరావు నియమితులయ్యారు. స్టీల్ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో గురువారం యూనియన్ సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్ కొమ్ము నియామకాన్ని ప్రకటించారు. ఇంత వరకు ఐఎన్‌టీయూసీ చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించిన కొమ్ము ప్రసాద్ సేవలను గుర్తించి పెద్ద బాధ్యతలు అప్పగిస్తున్నామని రాజశేఖర్ తెలిపారు. ఆయన నియామకం ద్వారా యూనియన్ మరింత బలోపేతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు పి.వి. రమణమూర్తి, గోపాలరాజు, ఎస్ఏ నాయుడు, మద్ది అప్పలరాజు, జగదీష్, సుబ్బారావు, ఎస్. రమేష్ కుమార్, కారు రమణ,అత్తోటి రవి, ఏఐటీయూసీ నాయకులు శివ రామకృష్ణ, ఎల్లేటి శ్రీనివాస్, బొడ్డు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కొమ్ము ప్రసాదరావును అభినందిస్తున్న స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు

నేటి నుంచి కిశోర బాలికలకు వేసవి శిక్షణ తరగతులు


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

అల్లిపురం: అంగన్‌వాడీ కేంద్రాలలో కిశోర బాలికలకు మే 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు సీడీపీవో ఎంవీ రమణకుమారి తెలిపారు. గురువారం అచ్చియ్యమ్మపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణకు సంబంధించిన అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. శిక్షణలో భాగంగా కిశోర బాలికల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు, బాలికల హక్కులు, చట్టాల గురించి వివరించాలని సూచించారు. బాల్య వివాహాల కట్టడి, బాలికల అక్రమ రవాణా నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాల గురించి తెలిపారు. ఈ సందర్భంగా కిశోర బాలికల శిక్షణ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్ బి.మమత, కె.శకుంతల, ఐ.సులేఖ తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం డిపో ఇన్‌చార్జి డీఎంగా శరత్‌బాబు


శరత్‌బాబును అభినందిస్తున్న ఉద్యోగులు

సింహాచలం: సింహాచలం ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి డీఎంగా ఎస్.శరత్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయం నుంచి ఆయన ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు డిపో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.రాజశేఖర్‌కు డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్‌గా (జోన్-1) పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఎంగా బాధ్యతలు స్వీకరించిన శరత్‌బాబును రాజశేఖర్, ఉద్యోగులు అభినందించారు.

త్వరలో తీరనున్న నీటి కష్టాలు

- రెండు లక్షల లీటర్ల సామర్థ్యంతో ఓహెచ్‌టీ
- రూ.5.5 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు
- నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రాజెక్టుకు ప్రతిపాదనలు


చినగంట్యాడ ప్రాంతం


చకచకా నిర్మాణం సాగుతున్న ఓహెచ్‌టీ

గాజువాక: గాజువాకలోని చినగంట్యాడ ప్రాంతంలో ఐదు ప్రధాన కాలనీలకు నీటి కష్టాలు తీరనున్నాయి. జీవీఎంసీ ప్రాజెక్ట్స్ విభాగం అధికారులు రెండు లక్షల లీటర్ల సామర్థ్యంతో కొత్తగా ఓవర్ హెడ్ ట్యాంక్ (ఓహెచ్‌టీ) నిర్మాణాన్ని ప్రారంభించారు. రూ.5.50 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయనున్నారు. నడుపూరు పంప్‌హౌస్ ప్రాంగణంలో ఈ నిర్మాణం చకచకా సాగుతోంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతిపాదనలు

ఈ ప్రాజెక్టు నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022లో ప్రతిపాదనలు రూపొందించింది. దీంతో జీవీఎంసీ ప్రాజెక్ట్స్ విభాగం అధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అనుమతులు, టెండర్ల ప్రక్రియ చేపట్టారు. అమృత్ 2.0 పథకం కింద ఏడాది కిందట టెండర్లు ఖరారు కావడంతో నవంబర్‌లో నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఈ పనులు చకచకా సాగుతున్నాయి. మరో ఏడాదిన్నరలో ఓహెచ్‌టీ అందుబాటులోకి వస్తుందని ప్రాజెక్టు విభాగం అధికారులు తెలిపారు.

పది వేల జనాభాకు ప్రయోజనం

ఈ ప్రాజెక్టు వల్ల సుమారు పది వేల మంది జనాభాకు ప్రయోజనం లభిస్తుందని అధికారులు తెలిపారు. దీనిపై ఇప్పటికే నివేదిక తయారు చేసిన అధికారులు చైతన్యనగర్, వినాయకనగర్, వుడా కాలనీ, రామచంద్రనగర్, ఎస్టీ కాలనీ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా మరింత మెరుగవుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఈ కాలనీల్లో నీటి సరఫరా సరిగా జరగని పరిస్థితి ఉంది. జనాభా అధికంగా ఉండటం, దాదాపు అన్ని ఇళ్లకు నీటి కనెక్షన్లు ఉండటంతో నీటి సరఫరాలో వివిధ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని ప్రాంతాలకు అనధికారికంగా రోజు విడిచి రోజు నీరు అందిస్తున్నారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే మరో 2100 కుళాయి కనెక్షన్లను అదనంగా మంజూరు చేయడానికి వీలు పడుతుందని అధికారులు తెలిపారు.

సకాలంలో నిర్మాణం

ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే ఆర్నెల్లు పూర్తయింది. మరో ఏడాదిరన్నలో పూర్తవుతుందని భావిస్తున్నాం. అమృత్ పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఈ నిర్మాణం సాగుతోంది. ఇది అందుబాటులోకి వస్తే గాజువాక పట్నంలో అందరికీ ప్రయోజనం లభిస్తుంది. దీనిపైకి కొన్ని కుళాయి కనెక్షన్లను తరలిస్తే మిగిలిన ప్రాంతాలకు ఒత్తిడి తగ్గుతుంది.

–రాజ్ కుమార్, సహాయ ఇంజనీర్, జీవీఎంసీ ప్రాజెక్ట్స్ విభాగం

గిరిజన అభ్యర్థులకు న్యాయం చేయాలి

ఎంవీపీకాలనీ: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఉపాధ్యాయ నియామకాల(డీఎస్సీ) ప్రకటన ద్వారా గిరిజన నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోందని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం పేర్కొంది. ఈ మేరకు సంఘం నాయకులు గురువారం రంపచోడవరం ఐటీడీఏలో గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు.